
పాశం రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## బీఆర్ఎస్ నాయకులు దీక్షతో పనిచేయాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ నాయకులు దీక్షతో పనిచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి పాశం రవిని శనివారం ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాశం రవి పది సంవత్సరాలుగా గాంధీనగర్ డివిజన్‌లో ప్రజా సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముదారపు రాకేష్, పోతుల శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, బత్తుల కిరణ్, పున్న సత్యనారాయణ, ముచ్చకుర్తి ప్రభాకర్, అప్స పద్మతదితరులు పాల్గొన్నారు.

### సీతారామ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు

**ముషీరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్‌లోని ఈడబ్ల్యూఎస్ ఈస్ట్ ఎంసీహెచ్ కాలనీలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ధ్వజస్తంభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ హోమం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం నవగ్రహహోమం నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశన, దేవతాహ్వానం, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, ప్రదోష కాల పూజ, అభిషేకాలు, పసువుల ముహూర్తం ఈవో దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ పర్యవేక్షణలో జరిగాయి.

### కల్యాణోత్సవానికి ఏర్పాట్లు..

శ్రీరామనవమి సందర్భంగా జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలకు చిక్కడపల్లి వెంకటేశ్వరాలయం ఎదుట కల్యాణ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 17న కల్యాణ మహోత్సవం ఆలయం ఎదుట ఉన్న కల్యాణ మండపంలో ఈ జరుగుతుందని ఈ సందర్భంగా నగరం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు.


ముషీరాబాద్‌లో డాక్టర్ మినాజ్‌ను సన్మానించిన కాంగ్రెస్ యువజన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్

## మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

● అరవింద్ కుమార్ యాదవ్

**ముషీరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** మైనార్టీల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేసి అన్నివిధాలా ఆదుకుంటున్నారని కాంగ్రెస్ యువజన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లో డాక్టర్ మినాజ్ ఆధ్వర్యంలో షీర్ కుర్మా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరవింద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముస్లింలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను చేపట్టిందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ఆదర్శముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మినాజ్‌ను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ అధ్యక్షుడు అంజియాదవ్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నక్కా కృష్ణా గౌడ్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జఫీర్ ఉద్దీన్, అల్లా ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, తదితరులు

## ఫొటో, వీడియోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య

**రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వృత్తిని స్వయం ఉపాధి కింద తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. చరిత్రకు సజీవ సాక్ష్యం ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అన్నారు. ఇటువంటి ఈ రంగంపై ఎన్నో వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రభుత్వం వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు జి.శ్రీధర్, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రుషీశ్వర్, జి.కరుణాకర్, కోశాధికారి ఎం. వేణు, ఉపాధ్యక్షుడు కె.వీరేష్, సంయుక్త కార్యదర్శులు ఎం. ఉదయ్, కె. కుమార్, ఎస్. శ్రీనివాస్, మహ్మద్ హబీబ్, ఆర్గనైజర్లు పి.కృష్ణ, వి.ఎస్. వెంకట్, కార్యనిర్వాహక కార్యదర్శులు వెంకి. యాదవ్, వై. చందు, కార్యదర్శులు కిషోర్, కె. అక్షయ్, సభ్యులు ఎస్. సతీష్, పి. నరేష్, గోవింద్, సలహాదారు కె.రఘురామ్, లీగల్ అడ్వయిజర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.


ధనుంజయకు నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

## బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధిగా ధనుంజయ

**రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధిగా అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేటకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ఈఎస్ ధనుంజయ నియమితులయ్యారు. శనివారం బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. ఎన్. గౌతమ్‌రావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనుంజయ మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, మాజీమంత్రి సి. కృష్ణాయాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాల్సిందే

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


ఇందిరాపార్కు చౌరస్తాలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ విజయ్ భాస్కర్ తదితరులు

**కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** బీసీల సమగ్ర అభివృద్ధి కోసం తీసుకువచ్చిన మండల కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా తొక్కి పెట్టిందని, ఇకనైనా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. అమలు చేయకుంటే ప్రస్తుతం జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీసీల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. శనివారం ఇందిరా పార్కు చౌరస్తాలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్లకు ఆద్యులు, బీసీలకు ఆరాధ్యులు అయిన బిందేశ్వర ప్రసాద్ మండల్ 42వ వర్ధంతి సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల ప్రధాత బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ తన జీవితాంతం బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం కృషి చేశారని అన్నారు. బీసీల సామాజిక స్థితిగతులపై బీపీ మండల్ నేతృత్వంలో మండల్ కమిషన్ దేశమంతా పర్యటించి సకల బీసీల సమస్యలను తెలుసుకొని మండల్ ఒక నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేసినప్పటికీ నేటికి ఆ నివేదికను అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ సామాజిక రంగాల్లో బీసీల వాటా అమలు చేసేందుకు తక్షణమే మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ బీపీ మండల్‌కు భారత రత్న అవార్డు ప్రకటించాలని, ఆయన విగ్రహాన్ని పార్లమెంటులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జాతీయ ప్రాజెక్టులకు ఆయన పేరు పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశీ రాజేందర్, మహేష్ మేరు, మల్లికార్జున్‌గౌడ్, భాస్కర్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.


సీఎంను కలిసిన టీఎమ్మార్పీఎస్ నాయకులు

## ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలి..

**బంజారాహిల్స్/కవాడిగూడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలని టీఎమ్మార్పీఎస్, టీఎంహెచ్‌డీ సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మాదిగ, ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించినందుకు శనివారం టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ, టీఎంహెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షులు జున్ను కనకరాజు మాదిగ నేతృత్వంలో పలువురు నేతలు మాదిగల జాతి వృత్తి అయిన డప్పును ముఖ్యమంత్రికి బహూకరించారు. ఈ సందర్భంగా మాదిగలకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాదిగల సంక్షేమం కోసం తాము రూపొందించిన 10 డిమాండ్ల పత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశామని తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు తమ సంఘాలు పూర్తి మద్దతు ఇస్తున్నాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం మాదిగ, ఇటుక గోపీ మాదిగ, సిరిసినోళ్ల బాలరాజు, కోరుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న వేణుగోపాలచారి

## ఎన్‌టీఆర్ స్టేడియంలో జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో

● కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి

**కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు, చేతివృత్తుల వారు తయారు చేసిన చేనేత వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ఆయన రిటైర్డ్ జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావుతో కలిసి ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన దాదాపు 300 స్టాళ్లను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నెల రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర అధ్యక్షురాలు కోట దేవకిదేవి, నిర్వాహకులు సత్యనారాయణచౌదరి, మహేష్‌సాయిచౌదరి, నదీమ్ పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు వచ్చే వారికి ఆహ్లాదం పంచేందుకు కూచిపూడి, భరతనాట్యం, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


దానం నాగేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

## మున్నూరుకాపు విద్యార్థి ట్రస్ట్ బోర్డును దేవాదాయ శాఖ నుంచి మినహాయించాలి

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డును దేవాదాయ శాఖ పరిధి నుంచి మినహాయించాలని ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్. మ్యాడం. వెంకట్రావ్, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి. శ్రీనివాస్‌రావులు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు. ట్రస్ట్ బోర్డును దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నారని వారన్నారు. ఇప్పటికే పలుమార్లు దేవాదాయ శాఖ పరిధి నుంచి తప్పించాలని వినతిపత్రం సమర్పించామని ఎలాంటి స్పందన లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చి తగు న్యాయం చేస్తానని దానం. నాగేందర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఎలగందుల. దేవేందర్, అమరం. చంద్రశేఖర్, నాయకులు అల్లాడి. సాయిప్రసాద్, సుధాకర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సదస్సులో మాట్లాడుతున్న తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం

## గెస్ట్ లెక్చరర్ల డిమాండ్లను పరిష్కరించాలి

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

**రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న 1600 మంది న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్. ఎం.కోదండరాం తెలిపారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్. ఈశ్వర్‌లాల్ అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.కోదండరాం మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న డిగ్రీ గెస్ట్ లెక్చరర్లందరినీ ఆటోరెన్యూవల్‌తో సర్వీస్‌ను కంటిన్యూ చేయాల్సిన అంశాన్ని ప్రభుత్వంతో చర్చించి కృషి చేస్తామన్నారు. అతితక్కువ వేతనాలతో విద్యాబోధన చేస్తున్న డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లను సీఎం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎంపీ ఎన్నికలైన తర్వాత అమలుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సదస్సులో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దెల. రమేష్, అసోసియేషన్ సెక్రటరీ జనరల్ వై.గణేష్, కోశాధికారి ఎన్. అశోక్, నాయకులు జావీద్, నరేష్, బంగు. నాయక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

**బాలానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని, మే 2 వరకు జరుగుతాయని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో సెషన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాస్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.



లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్-2024లో మాట్లాడుతున్న డాక్టర్లు

## మోకాలి శస్త్రచికిత్సలో ఆధునాతన పద్ధతులు

● డా.కె.రఘువీర్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** మోకాలి శస్త్రచికిత్సలో ఆధునాతన పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని డా.కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంజురీ ఆర్థ్రోస్కోపీ 25 ఏళ్ల సేవలు పూర్తి చేసిన సందర్భంగా హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్-2024ను నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సులో ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ రంగంలో మెళకువలు తెలుసుకునేందుకు, తమ అనుభవాలు పరస్పరం పంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 400 మంది సర్జన్లు సదస్సులో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కె.రఘువీర్ రెడ్డి, డా.అడ్రియన్ విల్సన్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మోకాలి కీళ్ల సంరక్షణలో నాన్ సర్జికల్, సర్జికల్ చికిత్సలు రెండూ ఉన్నాయని, దీనికి విరుద్ధంగా మోకాలి మార్పిడి అనే పద్ధతిలో మోకాలికీలులో దెబ్బతిన్న భాగాలు తొలగించి, వాటి స్థానంలో కృతిమ భాగాలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. రీఅలైన్‌మెంట్ ఆస్టియోటమి, మెనిస్కస్(జాయింట్ స్పాంజ్), లిగమెంట్, కార్టిలేజ్ శస్త్రచికిత్సల వంటి ఆధునాతన పద్ధతులున్నాయని తెలిపారు. హై టిబియల్ ఆస్టియోటమీ(హెచ్‌టీఓ) అనేది ఒక శస్త్ర చికిత్స ప్రక్రియని, దీనిలో మోకాలి కీలు కింద ఉన్న షిన్ ఎముకను కత్తిరించడం ద్వారా వంకర కాలును నిటారుగా చేయవచ్చన్నారు. ఆస్టియోటమీతో దెబ్బతిన్న మోకాలి కీలు మార్పిడి అవసరం లేకుండానే మోకాళ్ల నొప్పులు తగ్గించవచ్చన్నారు. కాలు ముడుచుకుని కూర్చునే రోజువారీ కార్యకలాపాలపై ఎటువంటి పరిమితులుండవని, కృత్రిమ మోకాలి కీలుతో పోలిస్తే సహజ మోకాలి స్థిరత్వం ఎక్కువగా ఉంటుందన్నారు. మోకాలి ఆస్టియోటమీ తర్వాత కోలుకునేందుకు సాధారణంగా 6 నుంచి 12 వారాల సమయం పడుతుందన్నారు.

## రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్ఎంసీ సర్కిల్ 15 ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది శనివారం గాంధీనగర్ డివిజన్‌లో రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులు నిర్వహించారు. బాపునగర్, గాంధీనగర్, జవహర్‌నగర్, వివేక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేస్తూ ప్యాచ్‌వర్క్ పనులున నిర్వహించారు. సర్కిల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పర్యవేక్షణలో సిబ్బంది అంజన్న తదితరులు ప్యాచ్‌వర్క్‌పనులు చేశారు.

## కార్పొరేట్ దిగ్గజాల కోసమే కమలం పార్టీ

● ప్రొఫెసర్ కంచె ఐలయ్య

**రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** దేశంలో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కమలం పార్టీ పనిచేస్తుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. మెజారిటీ ప్రజల అభివృద్ధికి దోహదపడ్డ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే-అంబేడ్కర్‌ల జనజాతర రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉడత రవీందర్, ఆవాజ్ కార్యదర్శి ఎండి.అబ్బాస్, టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, గుమ్మడి గణేష్, దశరథ్, సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్. కంచె ఐలయ్య

## నేడు నల్లకుంటలో అన్నదానం

**నల్లకుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** హరిహర పుత్ర అయ్యప్ప స్వామి సంఘం ఆధ్వర్యంలో కేరళ నిషపండగ సందర్భంగా అయ్యప్ప స్వామి పూజ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాంపల్లి మల్లేష్ తెలిపారు. శనివారం ఆయన నల్లకుంటలో విలేకరులతో మాట్లాడుతూ అయ్యప్ప స్వామి పూజ, అన్నదానం ఆదివారం ఉదయం 10.30 గంటలకు నల్లకుంట మెయిన్‌రోడ్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా ఈశ్వరాకుల వీధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.


రేణుకకు నియామక పత్రం అందజేస్తున్న భాగ్యలక్ష్మి

## ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా రేణుకా ముదిరాజ్

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా రేణుకా ముదిరాజ్ నియమితులయ్యారు. శనివారం కాచిగూడలోని కార్యాలయంలో ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా బిల్లును తీసుకువచ్చిన బీజేపీకి మహిళలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామన్నారు. ఓబీసీ సెంట్రల్ కమిటీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని రేణుక ముదిరాజ్ తెలిపారు.

## 13 మద్యం బాటిళ్లు స్వాధీనం

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. పార్వతమ్మ (66) అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుందని ఆమె నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని శనివారం కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## నేడు రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణపై సదస్సు

**కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలతో ప్రమాదంలో పడిన భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్యం రక్షణపై ఈ నెల 14న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉభయ్‌దుల్లా కొత్వాల్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు పాపారావు తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సదస్సులో మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామ్య వాదులు, లౌకిక వాదులు, ఆమ్‌ఆద్మీపార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## చంద్రకళకు మహిళాసేవారత్న పురస్కారం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** పురస్కారాలు ఉత్సాహాన్ని ఇవ్వడంతోపాటు మరింత సమాజ సేవ చేయడానికి దోహదపడతాయని కేంద్రమాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, గాంధీనగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గుర్రం చంద్రకళశంకర్ యువ జాతీయస్థాయి శతాబ్ది మహిళాసేవారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని సముద్రాల వేణుగోపాలచారి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రకళశంకర్ మాట్లాడుతూ రాజకీయ, సేవా రంగాల్లో తానుచేసిన సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఎంతో సహకరిస్తున్న తన భర్త శంకర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.


బాపూజీనగర్‌లో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

## మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

**ముషీరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లో వారం రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు ఏరులై పారుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు పూసగోరక్‌నాథ్ ఆరోపించారు. ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లో స్థానికంగా ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండడం వల్ల మంచినీటి సరఫరా కలుషిత నీటితో వస్తున్నాయని పూసగోరక్‌నాథ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదుచేస్తే ఈ సమస్య పరిష్కారం అయిందని మెసేజ్‌లు వస్తున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## యాదాద్రి అఖిల భారత పద్మశాలి అన్నసత్రం ప్రధాన కార్యదర్శిగా దేవదాసు


చిక్కా దేవదాసు

**రాంనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** యాదాద్రి అఖిల భారత పద్మశాలి అన్నసత్రం ప్రధాన కార్యదర్శిగా పార్సిగుట్ట నివాసి, ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత చిక్కా దేవదాసు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని సంఘం ఎన్నికల అధికారులు చిలివేరు చంద్రయ్య, బూర. శంకర్, బిట్ల ఉప్పలయ్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా చిక్కా దేవదాస్ రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ సామాజిక సేవే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

## యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆజామాబాద్ ఎస్ఆర్‌టి పార్కువద్ద గంజాయి బ్యాచ్ బరితెగించింది. అందరూ చూస్తుండగానే ఓ యువకునిపై వారు దాడికి పాల్పడ్డారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గంజాయి మత్తులో బైక్ వేగంగా నడిపిన యువకులను ఎస్ఆర్‌టి కాలనీకి చెందిన ఓ యువకుడు మందలించాడు. దీంతో బరితెగించిన గంజాయి బ్యాచ్‌లోని దాదాపు ఇరవై మంది ఆ యువకుడిపై మూకుమ్మడిగా దాడి చేసి కొట్టారు. అక్కడి సీసీ కెమెరాలో దాడి దృశ్యాలు నమోదైనట్లు తెలుస్తోంది. బాధితుడు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దాడి చేసిన గంజాయి బ్యాచ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.